క్లుప్తంగా

'కడెం'కు స్వల్ప ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం 5,435 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక గేటు ఎత్తి 6,381 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 698.225 అడుగుల నీరు ఉంది.

అంబులెన్స్‌లో కవలల జననం

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామానికి చెందిన జాదవ్ సంగీత అనే గర్భిణికి గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనంలోనే సంగీత కవలలు(ఆడ, మగబిడ్డ)కు జన్మనిచ్చింది. ఈఎంటీ సురేశ్, పైలట్ హాఫీ జ్ ప్రథమ చికిత్స చేసి వారిని ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట గ్రామానికి చెందిన జాడి శాంతి (40) అనే మహిళ మతిస్థిమితం సరిగా లేక గత నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త శంకర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. గురువారం కరీంనగర్ జిల్లాకేంద్రంలో శాంతి ఉందని సమాచారం అందడంతో దస్తురాబాద్ పోలీసులు వెళ్లి తీసుకొచ్చారు. అనంతరం ఆమెను ఆకొండపేట గ్రామానికి తీసుకెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడికి అండ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన రమణ అనే ప్రైవేటు ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న గ్రామానికే చెందిన నల్ల వినయ్‌రెడ్డి.. రమణకు ప్రతినెలా రూ.మూడు వేలను సాయంగా అందించేందుకు ముందుకొచ్చారు.గురువారం వినయ్‌రెడ్డి పంపిన డబ్బులను గ్రామస్తులు రమణకు అందించారు.

20న దీక్ష జయప్రదం చేయాలి

ఖానాపూర్: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరాహారదీక్షను జయప్రదం చేయాలని ఎంపీఆడ్ జిల్లా కార్యదర్శి అడిదెల రాజేశ్వర్ కోరారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు తహసీల్దార్ సుజాతతో వికలాంగుల వాయిస్ మాస పత్రికను ఆవి ష్కరించారు. అశోక్, లావణ్య, లక్ష్మి తదితరులున్నారు.

మేదరులను ఆదుకోవాలి




మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌టౌన్: అన్నిరంగాల్లో వెనుకబడిన మేదరులను ప్రభుత్వం ఆదుకోవాలని మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో గురువారం ప్రపంచ వెదురు దినోత్సవం నిర్వహించారు. మేదరి బంధు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణమోహన్, సలహాదారు రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దశరథ్, రాజేందర్, మహేశ్వర్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద తీర్చాలి

భైంసాటౌన్: పట్టణంలో కోతుల బెడద తీవ్రమైందని.. పలువురిపై దాడులు సైతం చేస్తున్నాయని పట్టణంలోని కిసాన్‌గల్లి మహిళలు వాపోయారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్ కుమార్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

బతుకమ్మ సంబరాలు



కల్లూరులో బతుకమ్మల వద్ద విద్యార్థినులు

కుంటాల: మండలంలోని కల్లూరు కేజీబీవీలో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. అనంతరం స్థానిక వాగులో నిమజ్జనం చేశారు. ఎస్‌ఓ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని కేజీబీవీలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎస్‌ఓ వీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతాళగంగ పైపైకి..



చామన్‌పెల్లిలో బోరు నుంచి వస్తున్న నీరు

ఇటీవలి వర్షాలకు భూగర్భజలాలు పెరిగాయి. లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లిలో కొమ్ముల మోహన్‌రెడ్డి అనే రైతుకు చెందిన బోరుబావి నుంచి మోటార్ ఆన్ చేయకుండానే 15 రోజులుగా నీరు ఉబికి వస్తోంది. వర్షాలు తగ్గేవరకు నీరు ఇలానే వస్తూ ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. భైంసా మండలం లింగాలో కదం మాధవ్‌రావు పటేల్ చేనులో ఉన్న బోరు నుంచి సైతం నీరు ఉబికి వస్తోంది. – లక్ష్మణచాంద/భైంసారూరల్



లింగా గ్రామంలో బోరు నుంచి పైకి వస్తున్న నీరు

నిర్మల్‌లో పంజాష గల్లీలో తిరుగుతున్న వానర సైన్యం



శాస్త్రీనగర్‌లో రోడ్లపై తిరుగుతున్న వీధికుక్కలు



కోతులు, కుక్కలతో బెంబేలు

జిల్లాకేంద్రంలోని వీధుల్లో ఓవైపు వానర సైన్యం.. మరోవైపు వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో స్కూల్‌కు వెళ్లే చిన్నారులతోపాటు పెద్దలు, వృద్ధులు ఇల్లు దాటి బయటకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు. పలుచోట్ల కోతులు ఇళ్లల్లోకి చొరబడి సరుకులను ధ్వంసం చేస్తున్నాయి. సాగర్‌కాలనీలో ఈనెల 17న బుధవారం వీధికుక్కల దాడిలో ఏడుగురు గాయపడగా ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

'సోయా'కు కష్టమొచ్చింది

- పంటకు సోకుతున్న తెగుళ్లు
- తగ్గనున్న దిగుబడి
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారుల సూచన



వెంకూర్‌లో పచ్చ తెగుళ్లు సోకిన సోయా పంట

ఖరీఫ్ సీజన్‌లో తక్కువ సమయంలో మంచి దిగుబడినిచ్చే పంట సోయాచిక్కుడు. ఎకరాకు 5 నుంచి10 క్వింటాళ్ల దిగుబడి సాధించే వీలుంటుంది. క్వింటాకు రూ.3వేల నుంచి రూ.3,900 వరకు గిట్టుబాటు ధర లభిస్తుంది. దీంతో భూసారం పెరుగుతుందని సాధారణంగా రైతులు సోయా పంట సాగుకు దృష్టి సారిస్తున్నారు. కానీ మొక్క ఎదిగి దిగుబడి చేతికందే సమయంలో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తోచడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కుంటాల: ఇటీవల కురిసిన భారీవర్షాలు సోయాబీన్ సాగు చేసిన రైతులను నట్టేట ముంచాయి. మరో నెల రోజుల్లో దిగుబడులు చేతికి రానున్న సమయంలో పంటను ఎల్లో మొజాయిక్ (పసుపు మచ్చ తెగులు) ఆశిస్తోంది. దీంతో మొక్కల ఎదుగుదల తగ్గి గింజ తాలుగా ఏర్పడుతోంది. పెట్టుబడులూ వచ్చేలా లేవని.. వ్యవసాయాధికారులు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

30 శాతం తగ్గనున్న దిగుబడులు

కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్‌లో 4,150 ఎకరాల్లో సోయా పంటను రైతులు సాగుచేశారు. మృగశిర కార్తెకు ముందు కురిసిన వర్షాలకు సోయా విత్తనాలు విత్తినా మొలకెత్తలేదు. దీంతో అప్పులు చేసి మళ్లీ రెండోసారి విత్తనాలు విత్తారు. తర్వాత వర్షాలు ఆశాజనకంగా కురువడంతో పంట ఏపుగా పెరిగింది. పూత, కాత దశకు చేరి గింజ నిండుకునే దశలో ఆకుపచ్చ మచ్చలు మొక్కలను ఆశిస్తోంది. దీంతో గింజ తాలుగా ఏర్పడి 30 శాతం దిగుబడులు తగ్గేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కలు ఎదగడం లేదు. వ్యాధి తీవ్రంగా ఉండడంతో పెట్టుబడులు రాలేని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు కురుస్తున్న వర్షాలకు కోత దశకు వచ్చిన సోయా చిక్కుడు దెబ్బతింటోంది.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి..

ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో సోయా పంటలో ఆకులు పసుపు మచ్చలోకి మారడం ద్వారా కాయలు నేలరాలుతున్నాయి. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని రైతులు కోరుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట మార్పిడి విధానం పాటిస్తూ.. నాణ్యమైన విత్తనాలు ఎంచుకొని విత్తనశుద్ధి చేసుకోవాలి సోయా చేనులో పచ్చ మచ్చలు సోకిన ఆకులను వెంటనే తెంపివేయాలి. తద్వారా తెగులు ఇతర మొక్కలకు వ్యాపించదు.

దిగుబడి తగ్గే ప్రమాదం



మొదటిసారి విత్తినప్పుడు వర్షాలు కురువకపోవడంతో మళ్లీ అప్పులు చేసి రెండోసారి విత్తనా లు విత్తాం. ప్రస్తుతం పంట ఎదిగే సమయంలో తెగులు సోకుతుంది. దీంతో దిగుబడులు సగానికి పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులే మమ్మల్ని కాపాడాలి.

– మల్లేశ్, రైతు, అందకూర్

అప్రమత్తంగా ఉండాలి



సోయాలో కాత, పూత దశలో పసుపు మచ్చ తెగుళ్లు ఆశి స్తాయి. దీంతో ఆకుల రంగు మారి మొక్క ఎదుగుదల తగ్గి గింజలు తక్కువగా వస్తాయి. తెగులు సోకిన వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలి. లీటర్ నీటికి టెబుపానజోల్ 1.5 మి.లీను కలిపి పిచికారీ చేయాలి.

– విక్రమ్, ఏవో, కుంటాల

గిరిజన సంస్కృతి తెలియజేయాలి



పుస్తకం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్: ఆధునిక పోకడలతో కనుమరుగవుతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థను సందర్శించారు. ఈసందర్భంగా అందులో ఉన్న 'ది రాజ్‌గోండ్స్ ఆఫ్ ఆదిలాబాద్'అనే పుస్తకంతో పాటు రచనలు, పుస్తకాలు, హైమన్‌డార్ఫ్ జీవన విధానాలు తెలుసుకున్నారు. పురాతన జ్ఞాన సంపదను భావితరాలకు అందించేలా వాటిని స్థానిక భాషల్లోకి అనువదించి భద్రపరచాలని అధికారులను కోరారు. గిరిజన ఉత్పత్తుల గురించి విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.

రేపు పోషకుల సమావేశం

నిర్మల్‌రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 20న(శనివారం) పోషకుల సమావేశం నిర్వహించాలని డీఈవో భోజన్న సూచించారు. ఆహ్వాన పత్రాల ద్వారా సమావేశానికి ఎక్కువ మంది తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. సమావేశంలో ఎజెండాలోని అంశాలను చర్చించాలని పేర్కొన్నారు. 'ఆనందంగా, సురక్షితంగా దసరా సెలవులు గడపడం' అనే అంశంపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు వివరంగా చర్చించాలని సూచించారు. సెలవుల అనంతరం ఎస్‌ఏ–1 పరీక్షలు ఉంటాయని, ఇంటి వద్ద విద్యార్థులను చదివించాలని తల్లిదండ్రులకు తెలపాలని వెల్లడించారు.

పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసాటౌన్: భైంసా మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేస్తామని భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తమకు వేతనాలు పెంచుతామని కొందరు డబ్బులు వసూలు చేశారని పేర్కొంటూ పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేశారన్నారు. ఈ విషయమై కలెక్టర్ నియమించిన సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ విచారణ జరుపుతుందన్నారు. వారు అందించే నివేదిక పరిశీలించి కలెక్టర్ చర్యలు తీసుకుంటారన్నారు. మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ విభాగంలో 105 మంది, నాన్ పీహెచ్ కింద 32 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉన్నారన్నారు. వీరికి బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. విచారణ అనంతరం నివేదిక ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. కార్మికుల వేతన బకాయిలు, పెండింగ్ పీఎఫ్, ఇతర సమస్యలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్ ఉన్నారు.

మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవాలి



కుభీర్‌లో పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాశ్

కుభీర్: సంపూర్ణ ఆరోగ్యం కోసం మహిళలు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆకాశ్ పేర్కొన్నారు. గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు విషయాలపై అవగాహన కల్పించారు. డా.ఆసియా వైద్యపరీక్షలు చేశారు. డాక్టర్ రాథోడ్ విజేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం పీహెచ్‌సీలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు ప్రీతం వైద్యపరీక్షలు చేశారు. మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దోస్ జబీన్, వైద్యసిబ్బంది సలీం, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

మామడ: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహిళలకు ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరంను నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గైనకాలజిస్ట్ వైద్యాధికారి స్వాతి 75 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

లక్ష్మణచాంద: ఇటీవల నియమితులైన జీపీవోలు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తహసీల్దార్ సరిత పేర్కొన్నారు. మండలంలో బాధ్యతలు చేపట్టిన తొమ్మిది మంది జీపీవోలు గురువారం తహసీల్దార్ సరితకు రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. డీటీ బాబుసింగ్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. లోకేశ్వరం మండలం గడ్‌చాంద గ్రామానికి చెందిన గుమ్మల ప్రమీలకు రూ.60వేలు, సిరిపురం శ్రీనివాస్‌రావుకు రూ.20వేల విలువైన చెక్కులు మంజూరవగా.. వాటిని బాధిత కుటుంబీకులకు అందించారు. వెంకట్‌రావు, నరేశ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

'ఎన్నికల హామీ అమలు చేయాలి'

సారంగపూర్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగ, వృద్ధాప్య తదితర పింఛన్లు పెంచి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక శంకర్ అన్నారు. గురువారం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. రాజు, దశరథ్, రమేష్‌రెడ్డి, శేఖర్, విజయలక్ష్మి, సాయి, గంగామణి, పోశెట్టి తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: దివ్యాంగులు, పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇన్‌చార్జి రేనుకుంట్ల సాగర్, ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి, ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంది రామయ్య, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి మారంపెల్లి రవి, వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు రహీం తదితరులు ఉన్నారు.

జోరు వర్షం.. విరిగిపడిన స్తంభం



ఎల్వి గ్రామంలో గోడపై పడిన స్తంభం

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లాయి. వీధుల్లో నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బం ది పడ్డారు. ఎల్వి గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగి ఓ ఇంటిగోడపై పడింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోగా.. అధికారులు మరో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

శాంతిభద్రతల రక్షణకు సహకరించాలి

భైంసాటౌన్: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పట్టణ ప్రజలు సహకరించాలని సీఐ జి.గోపినాథ్ అన్నారు. గురువారం పట్టణంలోని జుల్ఫికర్ గల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 115 బైక్‌లు, 3 ఆటోలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. కాలనీలో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో నేపథ్యంలో శాంతి వాతావరణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నవనీత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు రావాలని ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అధికారి



ఎస్పీని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని ఈవో అంజనాదేవి కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిలను ఆహ్వానించారు. గురువారం వారిని కలిసి ఈమేరకు ఆహ్వాన పత్రిక అందించారు. ప్రధానార్చకుడు సంజీవ్ అమ్మవారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అర్చకుడు హరీశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గురువారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బీజేపీ పట్టణ, మండలాధ్యక్షులు రావుల రాము, సుష్మారెడ్డి, రాజన్న, ప్రధానాచార్యులు భోజన్న ఉన్నారు.

పంచగుడిలో కందువాల వేడుక

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి పోచమ్మ మందిరం వద్ద గురువారం కందువాల వేడుక నిర్వహించారు. మిఠాయిలు పంచుకుని సరదాగా గడిపారు. సతీశ్‌రెడ్డి, మోహన్, నవీన్, హోటల్ రాజు, రాజన్న, రాజేందర్, భోజన్న, ఉదయ్ ఉన్నారు.

తర్లపాడ్‌లో పెద్ద పండుగ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో గురువారం పెద్దపండుగ నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం పూజాది కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రత్నం, రమేశ్, వెంకటి, నర్సయ్య, మహేశ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి'

ఖానాపూర్: కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని చందునాయక్ తండా, రాజుర గ్రామాల కాంగ్రెస్ నాయకులు నిమ్మానాయక్, చిన్నం రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని రాజుర ఆరోగ్య ఉపకేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే బొజ్జు, ఎంపీలు గ్రామంలో ఉపకేంద్రం ప్రారంభోత్సవంలో బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల్లో ఒక్క ఇల్లు, రేషన్‌కార్డు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. సంజీవ్ తదితరులు ఉన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

ఖానాపూర్: అర్హులను నూతన ఓటరు జాబితాలో ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ సుజాత అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. ఆర్ఐలు నగేశ్, సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ సబిత తదితరులు ఉన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

కుంటాల: మండలకేంద్రంలోని 18 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను గురువారం లబ్ధిదారులకు జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, జుట్టు లక్ష్మణ్, లక్ష్మణ్, సంతోష్, గజ్జారాం పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

సారంగపూర్: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సంధ్యారాణిని గురువారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్వర్, మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, కార్యకర్తలు ఉన్నారు.

వాహనదారులకు అవగాహన

ముధోల్: వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై బిట్లా పెర్సిస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనదారులకు పలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

సోన్: తెలంగాణ గౌడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన టి. గోపిగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామాను తెలంగాణ గౌడ కులపోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కృష్ణగౌడ్ పంపినట్లు పేర్కొన్నారు.

శతక పద్యాల పోటీలు

మామడ: మామడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం శతకపద్యాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి బహుమతులు అందించారు. హెచ్‌ఎం ఈశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయాం.. ఆదుకోండి



పొలం పరిశీలిస్తున్న రైతులు

కడెం: నకిలీ విత్తనాలతో పంట సాగు చేసి నష్టపోయానని.. కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నాడు మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ రైతు అర్కల రాజేశ్. కడెంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో వరి విత్తనాలు కొని రెండెకరాల్లో సాగు చేయగా కర్రలు వరి గొలుకలుగా మారిపోతున్నాయని వాపోయాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈవిషయమై ఏవో దినేశ్‌ను 'సాక్షి' సంప్రదించగా రైతు ఫి ర్యా దు మేరకు గురువారం ముధోల్ డాట్ సెంటర్ సైంటిస్ట్ కార్తీక్‌తో కలిసి పంట ను పరిశీలించామన్నారు. వరినాట్లు ఆలస్యమవడం ఒక కారణమని.. కంపెనీకి ఫిర్యాదు చేయాలని ఫర్టిలైజర్ డీలర్‌ను ఆదేశించినట్లు ఏవో పేర్కొన్నారు.